క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సతీష్

అడ్డతీగల: మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో డాక్టర్ పండా సతీష్ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, డయేరియా, హైపటైటిస్ తదితర వ్యాధుల లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనారోగ్యమైతే తక్షణమే వైద్య సేవలు పొందాలని సూచించారు. వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీఐగా గౌరీశంకర్ బాధ్యతల స్వీకరణ



రాజవొమ్మంగి: రాజవొమ్మంగి సర్కిల్ ఇనస్పెక్టర్‌గా ఎస్.గౌరీశంకర్ సోమవారం విధుల్లో చేరారు. ఆయన కాకినాడ ఎస్పీ కార్యాలయం, గ్రీవెన్స్ విభాగంలో పనిచేస్తు ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన సీఐ సన్యాసినాయుడు రంపచోడవరం ట్రాన్స్‌ఫర్ అయ్యారు. శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తానని గౌరీశంకర్ విలేకరులతో చెప్పారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజారోగ్యం పట్ల తన వంతు కృషి చేస్తానని అన్నారు.

విద్యార్థులకు బ్యాగ్‌లు పంపిణీ


విద్యార్థులకు బ్యాగ్‌లు, యూనిఫారం పంపిణీ చేస్తున్న ఎంఈవో శ్రీనివాసరావు

అడ్డతీగల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర యూనిఫాం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పి.శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ మండలంలో ఉన్న అన్ని పాఠశాలలకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్స్ పంపిణీ నూరుశాతం విద్యార్థులకు పంపిణీ చేశామన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సత్తిరెడ్డి, హెచ్‌ఎంలు వెంకటేశ్వర్లు , వెంకటరత్నం , నాగమణి, అబ్బాయిదొర తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఎంఈవో తనిఖీలు


పాతరామవరం పాఠశాలలో తనిఖీ చేస్తున్న ఎంఈవో-2 మల్లేశ్వరరావు

గంగవరం : మండలంలోని నెల్లిపూడిలో ఎంపీపీ పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాల, పాతరామవరం ఎంపిపి పాఠశాలలను ఎంఈవో-2 టి.మల్లేశ్వరరావు సోమవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

రహదారి సమస్య పరిష్కరించాలని వినతి


ఐటీడీఏ పీవో సింహాచలంనకు వినతి పత్రాన్ని ఇస్తున్న సర్పంచ్ వెంకటేశ్వర్లు దొర

గంగవరం : కొమరవరం గ్రామానికి సరైన రహదారి లేక గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలంను కోరినట్లు మర్రిపాలెం సర్పంచ్ మడకం వెంకటేశ్వర్లుదొర, మాజీ సర్పంచ్ కోటం చిన్నాలరావుదొరలు తెలిపారు. రంపచోడవరంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో కొమరవరం రహదారి సమస్యపై సర్పంచ్ మర్రిపాలెం సర్పంచ్ మడకం వెంకటేశ్వర్లుదొర, మాజీ సర్పంచ్ కోటం చిన్నాలరావుదొరలు ఆధ్వర్యంలో గ్రామస్తులు పీవో సింహాచలంనకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ అధ్వాన రహదారితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వర్షంపడితే చిత్తడిగా మారడంతో రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నామని వినతిలో పేర్కొన్నారు. రహదారి సమస్య పరిష్కరించాలని కోరారు.

దారుణ దారులు


రాళ్లు తేలిన బల్లుగూడ రహదారి

- రాళ్లు తేలిన రహదారులు
- గోతులతో సతమతం
- ప్రమాదాల బారిన వాహనచోదకులు
- పట్టించుకోని అధికారులు

ముంచంగిపుట్టు: ఏజెన్సీలో చాలా ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా మన్యంలో ఎక్కడ కూడా ఒక్క అభివృద్ధి పని చేసిన దాఖలాలు లేవు. అల్లూరి జిల్లాలోని ఏ గ్రామంలోని రోడ్డు నిర్మించలేదు. దీంతో గిరిజనులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని బాబుశాల పంచాయితీ కేంద్రం నుంచి బల్లుగూడ వెళ్లే రహదారి రాళ్లు తేలి గోతులమయంగా మారింది.దీంతో రాకపోకలకు గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని నెలలుగా రహదారి పరిస్థితి ఈ విధంగా ఉంది. పాడైన రహదారితో వాహనదారులు ప్రతిరోజు అవస్థలు పడుతున్నారు. గతంలో అనేకసార్లు రహదారిను బాగు చేయాలని అధికారులను కోరినా కనీస స్పందన కరువైయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా బరడ పంచాయితీ కేంద్రం నుంచి ఒంగ్రగూల, సోలగంపుట్టు గ్రామాలకు రహదారి అడుగు అడుగునా గోతులుగా మారి, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అత్యవసర సమయాల్లో గర్భిణులను తీసుకెళ్లినపుడు నరకం చూస్తున్నామని చెబుతున్నారు. గోతులను పూడ్చాలని కోరుతున్నారు. సుజనకోట పంచాయితీ కుమ్మరిపుట్టు, దార్రెల పంచాయతీ పేట మాలిపుట్టు, కోడాపుట్టు గ్రామాలకు చెందిన రహదారులు పనులు మొదలుపెట్టి అసంపూర్తిగా వదిలేశారు. రాళ్ల తేలి వదిలేయడంతో ఆయా గ్రాస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రయాణాలు చేస్తున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి రహదారులను పూర్తి చేయాలని పేటమాలిపుట్టు ,కోడాపుట్టు, కుమ్మరిపుట్టు గ్రామాల గిరిజనులు కోరుతున్నారు. ఈ రహదారి సమస్యపై ఆర్‌అండ్‌బీ అధికారులు మాట్లాడుతూ రోడ్డు మరమ్మతుల కోసం అధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని అరకు సంత జాతీయ రహదారి నుంచి కొర్రాయి, కొల్లాపుట్టు మీదుగా ఒడిశా అంతర్రాష్ట్రం పుకలి వెళ్లే ఈ రహదారి వద్ద ఉన్న వంతెనతో పాటు రోడ్డు అధ్వానంగా ఉంది. అంతర్రాష్ట్ర ప్రజలతో పాటు ఈ రెండు పంచాయతీవాసులు వారు పండించిన పంటలతో పాటు అటవీ ఉత్పత్తులు, కూరగాయలు వారపు సంతలకు తరలించాలంటే ఎంతో ఇబ్బందిపడి తరలిస్తున్నారు. అలాగే అదే కొర్రయి పంచాయతీకి చెందిన గత్తర చెడుల వెళ్లే గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారుల సమస్య పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు వినతులిచ్చినా ఫలితం లేకుండా పోయిందని వారు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ గ్రామాలకు రోడ్డు సౌకర్యంతో పాటు వంతెన సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.


బురదమయంగా రంగిసింగిపాడు రోడ్డు


కుమ్మరిపుట్టు రహదారి దుస్థితి


కొర్రాయి రహదారి దుస్థితి

పాడేరు రూరల్: మండలంలో సలుగు పంచాయతీ రంగిసింగిపాడు రోడ్డు అధ్వానంగా మారింది. పెద్ద పెద్ద గోతులతో రాళ్లు తేలిన రహదారిపై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. వర్షాలు కురుస్తున్న కారణంగా గోతుల్లో నీరు చేరి వాహనచోదకులు ప్రమాదాల బారినపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో గ్రామానికి 104,108, అంబులెన్స్ సేవలు అందని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇబ్బందులు తప్పడం లేదు

మా గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రాళ్లు తేలిన దారిపై రాకపోకలు కష్టంగా మారాయి. అత్యవసర సమయాల్లో 108,104 వాహనాల ద్వారా రోగులను తరలించేందుకు నానా అవస్థలు పడుతున్నాం. అధ్వాన రహదారులు బాగుచేయాలని పలుమార్లు అధికారులకు వినతులిచ్చినా ఫలితం లేకుండా పోయింది.ఇప్పటికైనా ప్రభుత్వం,ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– రామ్మూర్తి, భల్లుగుడ

ప్రత్యేక మండల కేంద్రాల కోసం డిమాండ్


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు తెడబారికి సురేష్‌కుమార్, సర్పంచ్ తదితరులు

పెదబయలు: అరకు నియోజకవర్గంలోని మండలంలోని గోమంగి, హుకుంపేట మండలం ఉప్ప కేంద్రాలుగా ప్రత్యేక మండలాలు ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు డాక్టర్ తెడబారికి సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని పెదకోడాపల్లి పంచాయతీలో ఆయన పర్యటించి గోమంగి ప్రత్యేక మండలాల ఏర్పాటుపై గ్రామస్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలను సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1983లో మండలాల ఏర్పాటుకు అప్పటి ప్రభుత్వం రోడ్డు నదుపాయం ఉన్న వాటిని తీసుకుని మండలాలు ఏర్పాటు జరిగిందని, ఇందులో భాగంగానే పెదబయలు మండలం ఒడిశాను ఆనుకుని ఉన్న పెదబయలును మండలం చేశారని గుర్తు చేశారు. పెదబయలు శివారు గ్రామాలకు 50 కిలోమీటర్లు పైబడి దూరం ఉందని, దీంతో ప్రజలు మండల కేంద్రానికి వచ్చి పనులు చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు కేంద్రంగా ఉన్న గోమంగిలో మండలం ఏర్పాటు చేయాలని, మండల సాధన కోసం 1998 నుంచి గోమంగి మండల సాధన సమితి అనేకసార్లు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చినట్టు చెప్పారు.అలాగే హుకుంపేట మండలం ఉప్ప కేంద్రంగా 15 గ్రామ పంచాయతీలకు కేంద్రంగా ఉందని అలాగే అనంతగిరి మండలంలోని ఆరు గ్రామ పంచాయతీలు ఉప్పను ఆనుకుని ఉందని ప్రభుత్వం స్పందించాలని కోరారు. రానున్న రోజుల్లో ఈ ప్రాంతవాసులను సమేకం చేసుకుని మండల కేంద్రాల ఏర్పాటుకు పెద్ద ఎత్తున ప్రభుత్వం ఒత్తిడి తెస్తామన్నారు. ఈ కార్యక్రమానికి పెదకోడాపల్లి సర్పంచ్ బట్టి చిట్టిబాబు, పంచాయతీ నాయకులు పాంగి రతుకుమార్,కొర్ర అప్పారావు, వినయ్‌కుమార్, కొర్ర వాసు, మర్రి భీమేష్ పాల్గొన్నారు.

గిరిజనుల మధ్య విభేదాలు సృష్టించడం తగదు


మారేడుమిల్లిలో మాట్లాడుతున్న వాల్మీకి సంఘం నాయకులు

రంపచోడవరం: రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.బాబురావు నాయుడు రచించిన పుస్తకంలో వాల్మీకి తెగను విమర్శిస్తూ రాయడంపై మారేడుమిల్లి మండల వాల్మీకి సంఘం తీవ్రంగా ఖండించింది. జిల్లా వాల్మీ సంఘం నాయకులు మారేడుమిల్లిలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబురావు నాయుడు రచించిన పుస్తకంలో వాల్మీకి తెగను విమర్శిస్తూ రాశారని పలువురు చెప్పారు. జిల్లాలో వాల్మీకి కుటుంబాలు 546 మాత్రమే ఉన్నట్టుగా రాజకీయ కుట్రలో భాగంగా తప్పుడు లెక్కలు చూపించినట్లు ఆరోపించారు. బాధ్యత గల రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అయి ఉండి వాస్తవాలు తెలుసుకోకుండా గిరిజన తెగల మధ్య విభేధాలు సృష్టించడ సరికాదన్నారు. ఆ పుస్తకాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వాల్మీకుల మనోభావాలు దెబ్బతినే విధంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జెడ్పీటీసీ సభ్యులు గొర్లె బాలాజీబాబు, కొండజాకబ్ , లక్కొండ రవికుమార్, మండల వాల్మీకి సంఘం ప్రతినిధులు అనుదీప్‌కుమార్, కుమార్, అనిల్ ప్రసాద్, బుజ్జి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం అరాచక పాలన


గుంటసీమలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పరశురామ్, వైస్ ఎంపీపీ ఆనందరావు, నేతలు

డుంబ్రిగుడ: మండలంలోని సొవ్వా, గసభ పంచాయతీల్లో ఎంపీపీ బాకా ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు సీహెచ్. జానకమ్మ, మండలంలోని గుంటసీమ, రంగిలిసింగి పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.పరశురామ్, వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద్‌రావు ఆధ్వర్యంలో సోమవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయా పంచాయతీల్లో వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం సమిష్టిగా కృషి చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీలు అన్ని స్థానాలు వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగుతుందన్నారు. ఎన్నికల్లో ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం అటకెక్కించిందన్నారు. అనంతరం గ్రామాల్లో గడపగడప తిరుగుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై క్యూఆర్ కోడ్‌లతో పోస్టర్‌లను ఆవిష్కరించారు. క్యూ ఆర్ కోడ్‌లను స్కాన్ చేసి కూటమి ప్రభుత్వం మోసాలను గమనించాలని కోరారు. రాష్ట్రంలో సాగుతున్న రెడ్‌బుక్ పాలనను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలో గుణపాఠం చెబుతారన్నారు. మండల పార్టీ ఉపాధ్యక్ష, కార్యదర్శులు గణపతి, మఠం శంకర్‌రావు, గుంటసీమ సర్పంచ్ గుమ్మ నాగేశ్వరరావు, ఎంపీటీసీ రామరావు, నాయకులు సింహాచలం, విజయదశమి, అశోక్ భబిత, నరసింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.


సొవ్వాలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, నేతలు

ప్లాస్టిక్ నిషేధంపై ప్రచారం


చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి, సర్పంచ్ సుభాష్‌చంద్ర

ముంచంగిపుట్టు: వ్యాపారస్తులంతా షాపుల ఎదుట డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకోవాలని ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి అన్నారు. మండల కేంద్రంలో పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధంపై సోమవారం ప్రచారం నిర్వహించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధం అమలును అందరు తప్పకుండా పాటించాలని, నిబంధనలను అతిక్రమిస్తే రూ.2,500 వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. షాపుల ఎదుట చెత్తను వేయవద్దని, ప్రతి షాపు వద్ద డస్ట్ బిన్ ఏర్పాటు చేసుకొని అందులో చెత్తను వేసేలా చూడాలని దుకాణదారులకు సూచించారు. మండల కేంద్రంలో వీధులన్నీ శుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ అధికారులు కృషి చేస్తున్నారని, వ్యాపారుస్తులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. సర్పంచ్ సుభాష్‌చంద్ర, ఈవోపీఆర్‌డీ చిన్నాన్న, పంచాయతీ కార్యదర్శి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దంటూ ప్రచారం

రాంబిల్లి(అచ్యుతాపురం): ప్రధాని మోదీ మెప్పు కోసం, అదానీకి లాభాల కోసం స్మార్ట్ మీటర్లను ప్రజల నెత్తిన రుద్దటం సరికాదని సీపీఎం మండల కార్యదర్శి జి.దేవుడుబాబు అన్నారు. రాంబిల్లి గ్రామంలో సీపీఎం, ఐద్వా ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కర పత్రాలు పంపిణీ చేసి, ప్రచారం చేశారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ట్రూఅఫ్, సర్దుబాటు చార్జీలు ప్రజలపై వేసి ఆర్థిక భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు లోకేశ్ నిర్వహించిన పాదయాత్రలో స్మార్ట్ మీటర్లను పగలగొట్టండని పిలుపునిచ్చి, ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి పేరుతో స్మార్ట్ మీటర్లను బిగించుకోవాలని సూచించడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. గతంలో బాదుడే బాదుడు, దంచుడే దంచుడు అని ప్రజల్లోకి వచ్చిన కూటమి నాయకులు.. ఇప్పుడు చేస్తుంది ఏమిటని నిలదీశారు. ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోకపోతే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

ఘనంగా వరసిద్ధి వినాయక కల్యాణం


పూజల్లో పాల్గొన్న భక్తులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతీ దేవాలయంలో సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి పంచలోహ ఉత్సవమూర్తుల ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం రాత్రి అర్చకులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. విగ్రహ దాత కొణతాల లక్ష్మీనారాయణ (పెదబాబు) జయలక్ష్మి దంపతులు కల్యాణంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, ఉపాధ్యక్షుడు ఆళ్ల మహాలక్ష్మినాయుడు, సహాయ కార్యదర్శి మళ్ల సూర్యప్రకాశరావు, ఆలయ ప్రధాన అర్చకుడు అంపోలు గోపాలకృష్ణశర్మ, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన అవసరం


పెదబయలు వారపు సంతలో మాట్లాడుతున్న ఎంపీడీవో పూర్ణయ్య, వైద్యాధికారి నిఖిల్

పెదబయలు: టీ.బి రహిత భారత్‌గా మార్చడానికి అందరి ప్రజల సహకారం అవసరమని, క్షయపై అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో ఎల్. పూర్ణయ్య, తహసీల్దార్ త్రినాథరావునాయుడు, పెదబయలు పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్ చెప్పారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా టి.బి.ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని వారపు సంతలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య, తహసీల్దార్ త్రినాథరావునాయుడు, పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్ మాట్లాడుతూ క్షయ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలన్నారు. వ్యాధి ప్రబలే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధిగ్రస్తులు వైద్యుల సూచనల మేరకు మందులు వినియోగించాలని సూచించారు. వైద్యాధికారి నిఖిల్ మాట్లాడుతూ ధూమపానం, ఖైనీ, గుట్కా, బీడి, సిగరెట్, చుట్టకు దూరంగా ఉండాలని ,రెండు వారాలు మించి దగ్గు ఉన్నవారు తప్పనిసరిగా కళ్లె పరీక్ష చేసుకోవాలన్నారు.అలసట, నీరసం,రాత్రి పూట చెమటలు పట్టడం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, జ్వరం రావడం, చాతిలో నొప్పి, ఆయాసం, శ్వాస ఆడకపోవడం, శరీరం ఇతర బాగాల్లో గడ్డలు రావడం జరుగుతుందని ఈ లక్షణాలు ఉంటేనే వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. క్షయ నిర్మూలనకు అందరి సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ నుంచి వారపు సంత వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో కొమ్ము కృష్ణమూర్తి, వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్తులను ప్రభుత్వం ఆదుకోవాలి


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న గిరిజన సంఘం ప్రతినిధి కిల్లో సురేంద్ర, నాయకులు

హుకుంపేట: సికిల్‌సెల్ ఎనీమియ వ్యాధితో మృతి చెందిన కుటుంబాన్ని ఆదుకోవాలని, రూ.5లక్షల నష్టపరిహారం చెల్లించాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర అన్నారు. మండలంలోని ములియపుట్టు గ్రామంలో ఆయన స్థానిక నాయకులతో కలిసి సోమవారం సందర్శించారు. ఈ నేపథ్యంలో ములియపుట్టు గ్రామానికి చెందిన బండంగి పావని(18) విశాఖ మహిళ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసించిందన్నారు. ఎం.వి.పి.కాలనీలోని గిరిజన సంక్షేమ శాఖ హాస్టల్‌లో ఉంటూ సికెల్‌సిల్ వ్యాధితో బాధపడుతూ కేజిహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయాన్ని తెలుసుకుని ఆ కుటుంబానికి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికిల్‌సెల్ ఎనీమియతో మృతి చెందిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. వ్యాధితో బాదపడుతున్న వారికి షరతు లేకుండా అందరికి పెన్షన్ అందించాలన్నారు. అంతేకాకుండా వ్యాధిగ్రస్తులకు ఉచితంగా రక్తం, పౌష్టిక ఆహారం అందించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం నాయకులు కృష్ణారావు, హైమవతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విద్యార్థులకు వైద్యపరీక్షలు


జి.మాడుగులలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది


నెల్లిపూడిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి సాయిరతన్


జీకే వీధిలోని శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

జి.మాడుగుల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పాఠశాలలోని 168మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో సేవలందించిన హెచ్‌వీ మేనక మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తినా పీహెచ్‌సీ, వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ లకే రామకృష్ణ, మండల పీసా కమిటీ ఉపాధ్యక్షుడు కిముడు మణికంఠ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యం దష్టిలో పెట్టుకొని పీహెచ్‌సీ వైద్యాధికారికి వినతిపత్రాన్ని అందించామని, దీంతో వైద్య శిబిరం ఏర్పాటు చేసినందుకు డాక్టర్‌కు, వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థులు క్రమ శిక్షణతో మెలగి, ఉన్నత విద్య పట్ల దృష్టి సారించి, తలిదండ్రులు కలల సాకారం చేయాలని వారు కోరారు. ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు, సీహెచ్‌డబ్ల్యూలు తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: మండలంలోని నెల్లిపూడి ఎంపీపీ పాఠశాల, ఎంపీపీ ప్రాథమికోన్నత పాఠశాలల్లో సోమవారం పిడతమామిడి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయిరతన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

గూడెం కొత్తవీధి: మండలంలోని రింతాడ బాలిక వసతిగృహంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో వసతి గృహంలో విద్యార్థులకు వైద్యుడు అచ్యుత్ వైద్య పరీక్షలు చేశారు. వీరిలో పది మందిని జ్వరపడీతులను గుర్తించారు. వారికి అవసరమైన పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ పరీక్షల్లో ఎవరికీ మలేరియా లేదన్నారు. శిబిరంలో 26 మందికి సికిల్‌సెల్ పరీక్షలు చేశారు. వారిలో ఒకరికి సికెల్‌సెల్‌గా గుర్తించి పాడేరు ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. విద్యార్థులందరికీ ప్రతి గురువారం ఐరెన్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. ఎంఎల్‌పీహెచ్ నిర్మల, హెచ్‌ఎం సుమిత్ర, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఎన్‌ఎం పద్మ, ఆశ కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి


భల్లుగుడలో సమావేశమైన వైఎస్సార్‌సీపీ మండల నాయకులు

అరకులోయటౌన్: వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కొత్తభల్లుగుడ గ్రామ కమిటీ కృషి చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు స్వాభి రామ్మూర్తి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు పల్టాసింగి విజయ్ కుమార్, వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, నియోజకవర్గం ఎస్టీ సెల్ కార్యదర్శి నర్సింహమూర్తి పిలుపునిచ్చారు.

మండలంలోని కొత్తభల్లుగుడ గ్రామంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదేశాల మేరకు పార్టీ నాయకుల ప్రత్యేక సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి మంచి ప్రజాదరణ ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరూ పార్టీకి విధేయులై పని చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా పార్టీ పంచాయతీ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా సోబోయి ధర్మనాయుడు, ఉపాధ్యక్షుడిగా కిల్లో రాంబాబు, కార్యదర్శులుగా కిల్లో రవికుమార్, బాకా కళ్యాణ్, కోశాధికారి సుబ్బారాజు, కార్యవర్గ సభ్యులను నియమించారు.

త్రిపురాంతక స్వామికి పూజలు

కోటికోట: స్థానిక సర్వమంగళాంబ సమేత త్రిపురాంతక స్వామి ఆలయం (శివాలయం)లో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని పూజలు చేశారు. అర్చకులు వి. చిదంబరం, కృష్ణల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దాతల ఆర్థిక సహాయంతో పేదలకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు.